# కారు జోరు

బీఆర్‌ఎస్ పార్టీలోకి వలస జోరు కొనసాగుతున్నది. సిరిసిల్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన రామన్నకు మద్దతుగా యువత ముందుకొస్తున్నది. కాంగ్రెస్, బీజేపీ నుంచి ఒక్కొక్కరుగా ముఖ్య నాయకులు ఆ పార్టీలను వీడి, బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఈ క్రమంలో గులాబీదండు రెట్టింపు ఉత్సాహంతో ప్రచారంలో దూసుకెళ్తున్నది. కాగా, టికెట్ల కేటాయింపు విషయంలో ప్రతిపక్ష పార్టీ నాయకుల్లో అసంతృప్తి రోజు రోజుకూ తీవ్రమవుతున్నది.

*- రాజన్న సిరిసిల్ల, నవంబర్8 (నమస్తే తెలంగాణ)*



సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు,నేతలు

- **యువ సమ్మేళనాలతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం**
- **కమలంలో టికెట్ల కేటాయింపుపై అసంతృప్తి**
- **పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లోకి చేరికలు**

గ్రామాలు, పట్టణాల్లో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం జోరందుకున్నది. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ హయాంలో తొమ్మిదిన్నర ఏండ్లల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ వివరిస్తున్నారు. కారు గుర్తుకే ఓటేసి బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరుతున్నారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన మంత్రి కేటీఆర్‌కు లక్షకు పైగా మెజార్టీ అందించాలని పిలుపునిస్తున్నారు. టికెట్ల కేటాయింపు విషయంలో ప్రతిపక్ష పార్టీల నాయకుల్లో అసంతృప్తి నెలకొన్నది. ఆవునూరి రమాకాంత్‌రావుతో మొదలైన అసంతృప్తి ఇంకా రాజుకుంటూనే ఉన్నది. దరువు ఎల్లన్న, మానకొండూరు నుంచి గడ్డం నాగరాజు, తాజాగా తంగళ్లపల్లి మండలం నుంచి బీజేవైఎం నాయకులు పెద్దఎత్తున బీజేపీని వీడి చీటి నర్సింగరావు, కొండూరి రవీందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. జిల్లాకు చెందిన పులువురు న్యాయవాదుల సైతం పెద్దఎత్తున కేటీఆర్‌కు మద్దతు తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని జలవిహారంలో బీఆర్‌ఎస్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో జిల్లాకు చెందిన న్యాయవాదులంతా పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కమలం పార్టీలో ముఖ్య కార్యకర్తలు సిరిసిల్ల టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. టికెట్ స్థానికేతరులకు కేటాయించడంతో ఆ పార్టీ నేతలంతా ప్రెస్‌మీట్లు పెట్టి బండి సంజయ్, రాష్ట్ర నాయకత్వంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీజేపీలను వీడనున్న కార్యకర్తలంతా బీఆర్‌ఎస్ పార్టీ నేతలతో మంతనాలు జరుపుతున్నారు. కేటీఆర్ సమక్షంలో చేరేందుకు ముహూర్తం ఫిక్స్ చేస్తున్నట్లు సమాచారం.

### వేములవాడలోనూ నిరసనలు ..

బీజేపీ టికెట్ తుల ఉమ్మకు ఇవ్వడంపై ఆ నియోజకవర్గంలోనూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే పార్టీలో చేరిన ఉమకు టికెట్ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. పార్టీలోని ముఖ్యనేతలంతా తమ అనుచరవర్గాన్ని తీసుకుని హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయానికి తరలివెళ్లారు. పార్టీ అధిష్టానంతో తాడోపేడో తెలుసుకునేందుకు ఓ రోజంతా అక్కడే ఉన్నారు. కాగా చెన్నమనేని విద్యాసాగర్‌రావు కుమారుడు వికాస్‌రావుకు టికెట్ ఇవ్వకపోవడంపై తీవ్ర మనస్థాపం చెందిన మేడిపల్లికి చెందిన ఓకార్యకర్త ఆత్మహత్యకు యత్నించాడు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో పెట్రోలు పోసుకోవడంతో అక్కడే ఉన్న కార్యకర్తలు నీళ్లు చల్లి యువకుడి ప్రాణాలు కాపాడారు. 15వ వార్డుకు చెందిన గడ్డమీది లావణ్య పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. ఇంకా చాలామంది బీజేపీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్లు తెలిసింది.

### యువ ఆత్మీయ సమ్మేళనాలతో జోష్

బీఆర్‌ఎస్ నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనాలతో పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపింది. సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, వేములవాడ నియోజకవర్గాలలో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనాలకు వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. ఆయన చేసిన ప్రసంగంతో కార్యకర్తలు, యువకుల్లో ఉత్సాహం నింపింది. సమ్మేళనాలకు భారీ ఎత్తున యువకులు రావడంతో మూడు సమ్మేళనాలు విజయవంతం అయ్యాయి. యువకులంతా రామన్న స్పీచ్‌కు ఆకర్షితులయ్యారు. యువ ఐకాన్, కాబోయే సీఎం అంటూ సభలో నినదించారు. సిరిసిల్లలో చేసిన అభివృద్ధితో పాటు వ్యవసాయ, వ్యవసాయ పాలిటెక్నిక్, మెడికల్, నర్సింగ్, జేఎన్‌టీయూ, ఐటీఐ కళాశాలల ఏర్పాటు చేయించి తమకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించాడంటూ యువత సంతోషం వ్యక్తంచేస్తున్నది. పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేలా జిల్లాను తీర్చిదిద్దుతున్న రామన్న వెంటే మేమంతా అంటూ.. సమ్మేళనాలను సక్సెస్ చేశారు. కార్యకర్తల బలం, కళ్లముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు కూడా మరోసారి రామన్న వస్తే అప్పారెల్ పార్కు, ఆక్వాహబ్, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీలు పూర్తి స్థాయిలో అభివృద్ధిలోకి వస్తాయి. వేలాది మంది స్థానికులకే ఉపాధి లభించే అవకాశం ఉందని యువత అభిప్రాయం వ్యక్తం చేస్తున్నది. యువ సమ్మేళనాల జోష్‌తో బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఎన్నికల కదన రంగంలో దూసుకుపోతున్నది.

# నేడే కేటీఆర్ నామినేషన్

- **ఆర్డీవో కార్యాలయంలో దాఖలు చేయనున్న అమాత్యుడు**
- **యువనేతపై అభిమానంతో స్వచ్ఛందంగా తరలిరానున్న కార్యకర్తలు**

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. హైదారబాద్ నుంచి బయలుదేరి ఉదయం 11గంటలకు సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణభవన్‌కు చేరుకుంటారు. 11.45గంటలకు ముఖ్య నాయకులతో కలిసి ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారని పార్టీ జిల్లా, పట్టణాధ్యక్షులు తోట ఆగయ్య, జిందం చక్రపాణి తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా నాలుగుసార్లు గెలిచిన కేటీఆర్ ఐదోసారి నామినేషన్ వేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో విస్త్రతంగా పాల్గొంటున్న ఆయన, గురువారం నామినేషన్ వేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉన్నది. ఎలాంటి హంగుఆర్భాటం లేకుండానే నామినేషన్ వేస్తారని పార్టీ వర్గాలు చెపుతున్నప్పటికీ, యువ నేతపై అభిమానంతో సిరిసిల్ల నియోజకవర్గం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చే అవకాశం ఉన్నది.

### రామన్నకు నీరాజనం..

స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి సిరిసిల్ల నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు వేరుగా ఉండేవి. రాష్టంలో అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థులెవరూ ఇక్కడ గెలువలేదు. గెలిచినవారంతా ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులే. అందుకే సిరిసిల్ల ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. కేటీఆర్ రాకతో సిరిసిల్ల ముఖచిత్రమే మారిపోయింది. ఆరున్నర దశాబ్దాల తర్వాత స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం, ఇక్కడి ఎమ్మెల్యేగా కేటీఆర్ గెలువడంతో సిరిసిల్లకు మహర్దశ వచ్చింది. స్వరాష్ట్రంలో ఆయన ఎమ్మెల్యే గెలుపొందడంతో చేనేత జౌళిశాఖ, మున్సిపల్, పరిశ్రమలశాఖల మంత్రి అయ్యారు. సిరిసిల్ల ప్రాంత ప్రజల కోరిక మేరకు జిల్లా ఏర్పాటు చేసి అన్నిహంగులు సమకూర్చారు. ఆత్మహ్యాతలతో ఉరిసిల్ల పేరును తుడిచివేశారు. కోట్లాది రూపాలయ నిధులు తెచ్చి అభివృద్ధిలో సిరిసిల్లను ఆదర్శంగా నిలిపారు. ఇక్కడి నుంచి నాలుగు సార్లు వరుసగా భారీ మెజార్టీతో గెలిచి ప్రజల మనసును గెలిచిన ఏకైక ఎమ్మెల్యే కేటీఆర్ అని గర్వంగా చెప్పుకోవచ్చు. మొదటిసారి తక్కువ ఓట్లతో గెలిచిన ఆయన, తర్వాత 2010, 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో ఊహించిన మెజార్టీతో గెలిచారు. ప్రతి ఎన్నికల్లో మెజార్టీ పెంచుతూ తీర్పు చెప్పిన ప్రజలతో ఆయన ఎంత మమేకమయ్యారో జరిగిన ఎన్నికలే నిదర్శనం.

### నామినేషన్‌కు స్వచ్ఛందంగా తరలిరానున్న కార్యకర్తలు

ఎలాంటి హంగుఆర్భాటం లేకుండానే ముఖ్య నేతలతో కలిసి కేటీఆర్ నామినేషన్ వేస్తారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ తమ అభిమాన నేత నామినేషన్ వేస్తున్నారన్న సమాచారం తెలిసి స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చే అవకాశం కనిపిస్తున్నది. కేటీఆర్ గురువారం నామినేషన్ వేస్తున్నారన్న సమాచారం ఇప్పటికే పల్లెపల్లెకు చేరింది. కార్యకర్తలంతా ఒకరికొకరు ఫోన్ చేసుకుంటూ ఎలా వెళ్దామంటూ చర్చించుకుంటున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాష్ట్రమంతా తిరిగి అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యతను భుజాన వేసుకున్న రామన్న, ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. క్షణంతీరిక లేకుండా అభ్యర్థులు, పార్టీ గెలుపే లక్ష్యంగా ఆయన రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం సిరిసిల్లకు వచ్చిన ఆయన కార్యకర్తలకు ఇదే విషయం చెప్పారు. చేపట్టాల్సిన ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. ఆయన ఆదేశాల మేరకు కార్యకర్తలందరూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే పలు కుల సంఘాలు, సొసైటీలు, ట్రాక్టర్ అసోసియేషన్లు, యువకులు పెద్దఎత్తున మద్దతు తెలిపాయి. రామన్న వెంటే మేమంటూ తీర్మానాలు కూడా చేశాయి. ముస్తాబాద్ మండలం మోహినికుంటలోని బుడగజంగాలు సైతం ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. గత ఎన్నికల్లో 90వేల మెజార్టీతో గెలిచిన రామన్నను, ఈ సారి లక్ష మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్తా శక్తివంచ లేకుండా పని చేస్తున్నారు. ఇక పార్టీలో కొత్తగా చేరిన వారు సైతం రామన్నకు జై కొడుతూ ఎన్నికల ప్రచారంతో ఉత్సాహం చూపుతున్నారు. ఐదోసారి రామన్నను అసెంబ్లీకి పంపేందుకు నియోజకవర్గ ప్రజలంతా మద్దతు తెలుపుతున్నారు.

### వేములవాడలో చల్మెడ లక్ష్మీనరసింహారావు..

వేములవాడ, నవంబర్ 8: వేములవాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. పట్టణంలోని తిప్పాపూర్, రాజన్న ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం, పోలీస్ స్టేషన్ మీదుగా తహసీల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీతో చేరుకొని నామినేషన్ వేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీవర్గాలు కోరాయి.

# నామినేషన్ల జాతర

- **ఒకే రోజు ఏడు దాఖలు**

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బుధవారం ఒక్క రోజే సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలో ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి నాలుగు, వేములవాడ నియోజకవర్గం నుంచి మూడు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. సిరిసిల్ల స్వతంత్ర అభ్యర్థిగా లగిశెట్టి శ్రీనివాస్, బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమదేవి తరపున ఆమె సోదరి గౌతమిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి తరపున కాముని వనతి, స్వతంత్ర అభ్యర్థిగా తాటిపాముల శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. వేములవాడ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా మహ్మద్ నజీర్, ధర్మసమాజ్ అభ్యర్థిగా గడ్డం హరీశ్, బీజేపీ అభ్యర్థి తుల ఉమ తరపున మహ్మద్ ఇక్బాల్ నామినేషన్ దాఖలు చేశారు.

# ఆత్మీయ సమ్మేళనానికి తరలిన దివ్యాంగులు

ముస్తాబాద్, నవంబర్ 8: స్వపరిపాలనలో దివ్వాంగులను సీఎం కేసీఆర్ ప్రభుత్వం గుర్తించి వారికి అన్ని రకాలుగా చేయుతనిచ్చిందని ఎంపీపీ జనగామ శరత్‌రావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ నిర్వహించే దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 200 మంది వరకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా దివ్వాంగులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనాలను ఎంపీపీ వివరించారు. పార్టీ మండలాధ్యక్షుడు బొంపల్లి సురేందర్‌రావు, ఉపాధ్యక్షుడు నల్ల నర్సయ్య, ముస్తాబాద్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నరసింహారెడ్డి, దివ్యాంగుల సమన్వయ కర్త లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దివ్యాంగుల మండలాధ్యక్షుడు రాములు తదితరులు ఆత్మీయ సమ్మేళనానికి తరలివెళ్లారు.

గంభీరావుపేట, నవంబర్ 8: జిల్లా కేంద్రంలో నిర్వహించిన దివ్యాంగులు ఆత్మీయ సమ్మేళనానికి మండలం నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లారని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్ అన్నారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా మంత్రి కేటీఆర్ అందించిన త్రిచక్ర వాహనాలతో సమ్మేళనానికి వెళ్తున్న దివ్యాంగుల ర్యాలీని కొత్తపల్లి పార్టీ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ నేతలు ప్రారంభించారు. సుమారు 25 వాహనాల్లో దివ్యాంగులు ఉత్సాహంతో సమ్మేళనానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, నేతలు కొమిరిశెట్టి లక్ష్మణ్, వంగ సురేందర్‌రెడ్డి, అక్కపల్లి రాజనర్సింహారెడ్డి, లింగన్నగారి దయాకర్‌రావు, కమ్మరి రాజారాం, గంద్యాడపు రాజు, చింతల సంజీవ్, నర్సింహులు, సలీం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు ఉన్నారు.



కొత్తపల్లి నుంచి ఆత్మీయ సమ్మేళనానికి తరలి వెళ్తున్న దివ్యాంగులు



సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో జరిగే సమ్మేళనానికి తరలివెళ్తున్న గంభీరావుపేట మండల దివ్యాంగులు